# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

## తేదీ: 20-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- రైతులకు సాధారణ సాగులో ఆదాయం తగ్గకుండా ప్రత్యమ్నాయ పంటలను సూచించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.
- రాష్ట్రంలో గంజాయి నిర్మూలకు ప్రభుత్వం కృషి చేస్తోందని విజయనగరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ తెలిపారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వసతి గృహాలు, గురుకులాల నిర్వహణలో అధికారలు అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25న ప్రసారమవుతుంది.

=======================

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి  కె. పవన్ కల్యాణ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీలకు స్వాతంత్ర్య వేడుకల వ్యయాన్ని 10 వేల రూపాయల నుంచి 25 వేల రూపాయలకు పెంచామని ముఖ్యమంత్రికి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనుల కోసం ప్రత్యేకమైన మొబైల్ యాప్ రూపొందించి, పర్యవేక్షిస్తున్నామని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హత వేటు నిబంధనను తొలగించామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన 13 వేల 326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నామని ముఖ్యమంత్రికి పవన్ కల్యాణ్ వివరించారు.

=======================

రాయలసీమ జిల్లాల్లో రైతు ఆదాయం తగ్గకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ రోజు సచివాలయంలో రాయలసీమలోని 8 జిల్లాల వ్యవసాయ ఉన్నతాధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖాళీగా ఉన్న వ్యవసాయ భూముల్లో సాగు ప్రోత్సహించడంతో... పాటు రైతులకు మేలు చేకూర్చేందుకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందించాలని ఆదేశించారు. రైతులకు సాధారణ సాగులో ఆదాయం తగ్గకుండా ప్రత్యమ్నాయ పంటలను సూచించాలని తెలిపారు.

=======================

రాష్ట్రంలో గంజాయి నిర్మూలకు ప్రభుత్వం కృషి చేస్తోందని విజయనగరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ అన్నారు. ఇందులో భాగంగా విజయనగరంలోని ధర్మపురి ప్రాంతంలో వసంత విహార్ విల్లాలో ఉత్తరప్రదేశ్ ఢిల్లీకి చెందిన ముగ్గురిని ఈరోజు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... విచారణలో ముగ్గురు గత సంవత్సర కాలంగా విజయనగరం నుంచి ఢిల్లీకి గంజాయి సరఫరా చేస్తున్నారని తెలిపారు. వారి నుంచి 22 కిలోల గంజాయితో పాటు, రవాణాకు వినియోగిస్తున్న వస్తువులు, సెల్ ఫోన్లు స్వాధీనం చేశామన్నారు. కేసులో మొత్తం 9 మంది పాత్ర ఉందని, మిగతావారినీ పట్టుకుంటామని ఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా గంజాయి విక్రయాలు జరిపినా, రవాణా చేసినా లేదా గంజాయి సేవించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని ఎస్పీ హెచ్చరించారు.

=======================

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో అధికారులు, వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, నాణ్యత లోపించిన పాడైన బయట ఆహారం వసతి గృహాల్లో పెట్టరాదని, బయట ఆహరం వసతి గృహాల్లోకి అనుమతించకూడదని అధికారులకు సూచించారు.

=======================

ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏ.డి.బి) ప్రతినిధులు ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు. ఈనెల 27వ తేదీ వరకు అమరావతిలో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందం పర్యటించనుంది.

=======================

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, విజయనగరంలో కొలువుదీరిన శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 30వ తేదీ వరకూ నిర్వహించనున్నాని ఆలయ కార్య నిర్వహణ అధికారి ప్రసాదరావు ఈరోజు వెల్లడించారు. అక్టోబర్ 14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమాను, 22న తెప్పోత్సవం, 29న ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

=======================

ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు వాగుదాటుతూ మృతి చెందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపాన్ని తెలియజేసారు. మృతి చెందిన వారి ఒక్కొక్క కుటుంబానికి 15 లక్షల రూపాయల ఆర్థిక సహాయం, ఉద్యోగాన్ని ప్రకటించడం జరిగిందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలోని ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... మూడు రోజుల క్రితం

సాలూరు నియోజక వర్గం పాచిపెంట మండలంలో ఏకలవ్య పాఠశాలకు చెందిన మహేష్, కీర్తి అనే ఉపాధ్యాయులు వాగు దాటుతూ దురదృష్టవశాత్తూ మృతి చెందడం జరిగిందన్నారు.

========================

ఉపరితల ఆవర్తనం ఉత్తర తమిళనాడు దానికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా ఆంధ్ర ప్రదేశ్ మీదుగా సగటున సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల వరకూ వ్యాపించి ఉందని అమరావతిలోని భాతర వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో తేలిక పాతి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలని శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ రోజు ఆమె జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నివారణకు చర్యలు చేపట్టానున్నామని ఈ సందర్భంగా డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు.

========================

విశాఖలో వున్న నావల్ సైన్స్ & టెక్నాలాజికల్ లాబొరేటరీ (NSTL) భారత నౌకాదళానికి కీలకమైన భాగస్వామిగా ఉందని తూర్పునావికాదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అన్నారు. దేశసేవలో 5 దశాబ్దాలకు పైగా చేస్తోన్న కఠోర శ్రమ, అంకితభావం, అవిశ్రాంత కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. NSTLలో మహాపాత్ర మానసి ఆడిటోరియంలో జరిగిన 55వ ల్యాబ్ రైజింగ్ దినోత్సవంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ మాట్లాడుతూ, దేశ సాధికారత దిశగా 55 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నందుకు NSTL బృందాన్ని అభినందించారు.

========================

నూతన ఓటర్ల నమోదు, సవరణలకు రేపటి నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బి.ఎల్.ఓ.)లు ఇంటింటి సర్వే చేపట్టనున్నట్టు చిత్తూరు జిల్లా రెవిన్యూ అధికారి బి. పుల్లయ్య పేర్కొన్నారు. ఈ రోజు సచివాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. అక్టోబరు 19 నాటికి ఈ కార్యక్రమం పూర్తిచేసి అక్టోబరు 29న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు.

========================

గిరిజనులు సమీకృత అభివృద్ధి సాధించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పి.ఎ.జన్.మన్ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ అభివృద్ధి సూచికలు గణనీయంగా మార్పు చెందాల్సిన అవసరం ఉందని, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకుచర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

========================

వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047-విజన్ ప్రణాళిక రూపకల్పనపై ఈ రోజు రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఐటి కార్యదర్శి సౌరవ్ గౌర్, కార్యదర్శి కె.శశిధర్, హరి నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

========================

గిరిపుత్రలను ఉన్నతంగా చదివించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. అరకు వ్యాలీ మండలం బొండం పంచాయతీ రేగ గ్రామంలో ఎంపీ లాడ్స్ 8 లక్షల 50 వేల రూపాయల నిధులతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల భవనాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కైలాస పట్టణంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని అన్నారు. గిరిజన విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు.

========================
========================